## రియల్ ఎస్టేట్ వ్యాపారిపై పీడీ యాక్ట్

రామకృష్ణాపూర్, జూలై 3: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగడిలోని నడిపెల్లి లక్ష్మీకాంతారావు హత్య కేసు నిందితుడి మామిడి శ్రీనివాస్‌పై రామగుండం సీపీ రెమా రాజేశ్వరి (డీఐజీ) సోమవారం పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ అశోక్‌తో కలిసి నిందితుడికి అందజేశారు. ఈ సందర్భగా వివరాలు వెల్లడించారు. మామిడి శ్రీనివాస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ మంచిర్యాలలోని సీసీసీ నస్పూర్ న్యూనాగార్జున కాలనీలో ఉంటున్నాడు. మంచిర్యాల గజానంద్ స్వీట్ హౌజ్ దగ్గర, గోసేవా మండల వద్ద ఉంటూ వ్యాపారం చేస్తుంటాడు. రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగడిలో ఇటీవల నడిపెల్లి లక్ష్మీకాంతారావు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారిని హత్య చేసి మరికొంతమందిని బెదిరించాడు. అలాగే ఆ ప్రాంతంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడు. నిందితుడిపై రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసులు నమోదు అయినట్లు తెలిపారు. అనంతరం నిందితుడిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించనట్లు వారు తెలిపారు.

## సైబర్ బాధితుడి ఖాతాలో డబ్బులు జమ

బెల్లంపల్లి, జూలై 3 : సైబర్ నేర బాధితుడి ఖాతాలో పోలీసులు డబ్బులను తిరిగి జమ చేయించారు. వివరాల్లోకి వెళ్తే.. బెల్లంపల్లి పట్టణంలోని ఇంక్లైన్ రడగంబాల బస్తీకి చెందిన మోతీరాం రాజేందర్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ముద్ర ఫైనాన్స్ నుంచి మాట్లాడుతున్నామని రూ. లక్ష లోన్ ఇస్తామని, అందుకు రూ. 13,100 పంపించాలని చెప్పాడు. నమ్మిన రాజేందర్ వెంటనే ఆ నంబర్‌కు డబ్బులు పంపించాడు. తర్వాత ఆ నంబర్ పనిచేయకపోవడంతో మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ క్రైం హెల్ప్ లైన్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి ఖాతాను ఫ్రీజ్ చేశారు. బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్‌కుమార్ గౌడ్ కేసు దర్యాప్తు చేసి బాధితుడు డబ్బులు పంపింది ఢిల్లీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు ద్వారా నిందితుడి అకౌంట్ నుంచి బాధితుడి ఖాతాకు రూ.13,100 తిరిగి జమ చేయించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కాల్స్, మెసెజ్, లింకులు వచ్చినా స్పందించవద్దని, ఆన్‌లైన్ ద్వారా ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే వెంటన్ సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

## ఎంపీడీవో కార్యాలయంలో చోరీ

కౌటాల, జూలై 3 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కార్యాలయంలోని ఒక బ్యాటరీ, ఉపాధిహామీ పథకం గదిలోని 4 బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం సిబ్బంది కార్యాలయం తలుపులు తీసి చూడగా వెనుక తలుపులు పగులగొట్టి ఉన్నట్లు గమనించారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏపీవో పూర్ణిమా, సిబ్బంది కార్యాలయంలో చూడగా బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బ్యాటరీల విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని తెలిపారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

## కలప పట్టివేత

జన్నారం, జూలై 3 : కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ అడవుల్లోని ఇందన్‌పెల్లి రేంజ్ ఇస్లాంపూర్ నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను పట్టుకున్నట్లు ఇందన్‌పెల్లి రేంజ్ ఆఫీసర్ హఫీసొద్దీన్ తెలిపారు. శనివారం సాయంత్రం తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా కామన్‌పెల్లి గ్రామం వద్ద కవ్వాల్ నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను అపి తనిఖీ చేయగా రూ 86 వేలువైన 6 టేకు దుంగలు లభ్యమైనట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్మగ్లింగ్‌కు పాల్పడిన కనక జైతుపై కేసు నమోదు చేసి లక్షెట్టిపేట కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.



అటవీ శాఖ అధికారులు పట్టుకున్న కలప దుంగలు

# బల్దియాలో బయోమెట్రిక్ హాజరు

- వివరాలు నమోదు చేస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు

మంచిర్యాలటౌన్, జూలై 3: మంచిర్యాల మున్సిపాలిటీలో ఉద్యోగులు, సిబ్బంది, కార్మికుల హాజరు ఇకపై బయోమెట్రిక్ విధానంలో తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. హైదరాబాద్‌కు చెందిన ఎంఆర్ కమ్యూనికేషన్స్ సంస్థ మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల బయోమెట్రిక్ హాజరు నమోదు కోసం పది మిషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నిధుల నుంచి రూ. 3.50 లక్షలు వెచ్చిస్తోంది. కాగా మున్సిపాలిటీలో ఉద్యోగులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు మొత్తం కలిపి 427 మంది ఉన్నారు. వీరందరి ముఖాలు, కంటిపొరలు (ఐరిష్), చేతి వేలి ముద్రలను సేకరిస్తున్నారు. ముందుగా కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది వివరాలను బయోమెట్రిక్ యంత్రంలో పొందుపరుస్తున్నారు. కార్యాలయంతో పాటు వాటర్‌ట్యాంక్, ముల్కల పంప్‌హౌజ్, ఎల్లంపల్లి ప్రాజెక్టు దగ్గర పంపుహౌజ్ దగ్గర కూడా బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేయనున్నారు. మిగిలిని ఆరు మిషన్లను పారిశుధ్య కార్మికులకు హాజరు తీసుకునే ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తారు. వీటి బాధ్యతను సంబంధిత జవాన్లకు అప్పగించనున్నారు. బయోమెట్రిక్ మిషన్లను జాగ్రత్తగా ఉంచాల్సిన బాధ్యతను కూడా జవాన్లకే అప్పగించనున్నారు. మరో మూడు



బయోమెట్రిక్ యంత్రంలో వివరాలు నమోదు చేస్తున్న ఇంజినీర్

రోజల పాటు ఉద్యోగులు, సిబ్బంది వివరాల నమోదు ప్రక్రియ జరుగుతుంది. అనంతరం కమిషనర్ సూచించిన వేళల ప్రకారం ఉద్యోగులు తమ హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ మిషన్ ముందుకు సంబంధిత ఉద్యోగి, కార్మికుడు రాగానే వారి ముఖాన్ని రీడ్ చేసుకున్న తర్వాత ఒకే అనే వాయిస్ వస్తుంది. వెంటనే సదరు ఉద్యోగి , కార్మికుడు అక్కడి నుంచి పక్కకు తప్పుకోవాల్సి ఉంటుంది. రెండోసారి ఫేస్ రీడ్ అయితే అది అవుటింగ్ కిందకు వస్తుంది. దీంతో ఆ రోజు ఉద్యోగి హాజరు నమోదు కానట్లే పరిగణిస్తారు. ఈ విషయంలో సంస్థ ఇంజినీర్ సందీప్ ఉద్యోగులకు, సిబ్బందికి, కార్మికులకు పలు సూచనలు ఇస్తున్నారు.

### మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక చొరవ

మున్సిపల్ కార్యాలయంలోని పలువురు ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, దీంతో పనులు త్వరగా కావడం లేదని పలువురు ప్రజలు మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బయోమెట్రిక్ విధానం ద్వారానే పరిష్కారం లభిస్తుందని భావించారు. అయితే అప్పటికే అన్ని మున్సిపాలిటీల్లో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉండడంతో అమలు చేయాలని నిర్ణయించారు. ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని భావించిన ఆయన ఆ మేరకు వెంటనే బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య కార్మికుల సంఖ్య చెప్పుకోవడానికి పెద్దగా ఉన్నప్పటికీ పనిచేస్తున్న వారెందరు అన్న ప్రశ్న చాలామంది నుంచి ఎదురవుతోంది. బయోమెట్రిక్ అమలుతో ఉద్యోగుల, కార్మికుల హాజరు మెరుగుపడడంతో పాటు పనులు సకాలంలో జరిగే అవకాశాలు ఉన్నాయి.

# పూలాజీబాబా బాటలో నడవాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



జైనూర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

జైనూర్, జూలై 3: ప్రతిఒక్కరూ పూలాజీబాబా బాటలో నడవాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని పట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్ ఆధ్వర్యంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. పూలాజీబాబా ప్రవచనాలతో చాలామంది ఆధ్యాత్మిక బాటలో నడుస్తున్నారన్నారు. అనంతరం ఇంగ్లే కేశవ్ మాట్లాడుతూ పూలాజీబాబాను ఆదర్శంగా తీసుకుని భక్తి పారవశ్యంతో సంఘం సేవలకు దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థాన ఉపాధ్యక్షులు వామన్ రావ్ ఇంగ్లే, డుక్రే సుభాష్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్, బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీరాం, మెస్రం అంబాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

### గిరి గ్రామాల అబివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, జులై 3 : జిల్లాలోని అదివాసీ గ్రామాల అబివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరారు. ఈ మేరకు ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అదించారు. ఇటీవల ఆసిఫాబాద్ పర్యటనలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని 10 మండలాల ఆదివాసీ గుడేల రైతులకు ఉచితంగా త్రీ ఫేజ్ కరెంట్ అందించాలని, బీటీ రోడ్డు, వంతెనలు , కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి నిధుల మంజూరు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని కోరమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, వైస్ ఎంపీపీలు ఆత్రం ప్రకాశ్, యోగేశ్, సర్పంచ్ పరమేశ్వర్, ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మరణంలోనూ వీడని బంధం

- ట్రాక్టర్ బోల్తాపడి అన్నదమ్ములు మృతి
- వైగాం గ్రామ సమీపంలో ప్రమాదం

కౌటాల, జూలై 3 : వారిద్దరు అన్నదమ్ములు. బతుకుదెరువు కోసం కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే మండలంలోని వైగాం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. బెజ్జూర్ మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన బుర్రి వసంత్ (22), బుర్రి అనిల్ (20) విద్యుత్ మరమ్మతులు చేసేందుకు పనికి వచ్చారు. గుడ్లబోరి నుంచి వైగాం వైపునకు స్తంభాలు, ఇతర సామగ్రిని ట్రాక్టర్‌లో వేసుకుని వసంత్, అనిల్, జంబుల శ్రీకాంత్ వెళ్తుండగా ట్రాక్టర్ అకస్మాత్తుగా బోల్తా పడింది. ట్రాక్టర్‌ను అనిల్ నడుపుతుండగా సోదరుడు వసంత్, శ్రీకాంత్ కూర్చున్నారు. కాగా ఈ ప్రమాదంలో వసంత్, అనిల్‌పై స్తంభాలు పడడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వీరి తండ్రి బుర్రి నీలయ్య 2006లో చెట్టుపై నుండి పడి మృతి చెందాడు. అప్పటి నుంచి అన్నదమ్ములు ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ తల్లి, చెల్లిని సాకుతున్నారు. అన్న



స్తంభాల కింద మృతదేహాలు

దమ్ములు ఒకేసారి మృతి చెందడంతో ఆ కుటుంబానికి దిక్కు లేకుండా అయింది. విషయం తెలుసుకున్న కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన శ్రీకాంత్‌ను 108 అంబులెన్స్‌లోద వాఖానకు తరలించారు. మృతదేహాలను సిర్పూర్ (టీ) సర్కారు దవాఖానకు తరలించారు. విషయాన్ని కుటుంబీకులకు సమాచారం అందించినట్లు, ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ట్రిపుల్ ఐటీ ప్రవేశాల జాబితా విడుదల

- 1,404 మంది విద్యార్థుల ఎంపిక

బాసర, జూలై 3 : బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల ఎంపిక జాబితా విడుదలైంది. మొత్తం 1500 సీట్లకు గాను 13538 దరఖాస్తులు రాగా... 1404 సీట్ల జాబితాను ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్ కుమార్ సోమవారం విడుదల చేశారు. మిగిలిన 96 సీట్లకు గాను కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తేదీలను కూడా ప్రకటించారు. సీట్లు పొందిన వారిలో ఈ ఏడాది కూడా బాలికలే అధిక శాతం ఉన్నారు.

### కౌన్సెలింగ్ తేదీలు

1404 సీట్లలో క్రమ సంఖ్య 1 నుంచి 500 ల వరకు ఈనెల 7న , 501 నుంచి 1000 వరకు 8న, 1001 నుంచి 1404 వరకు 9న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పీహెచ్, స్పోర్ట్స్ కోటాలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 14న, ఎన్‌సీసీ, క్యాప్ కేటగిరీ సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ఈనెల 15న నిర్వహించనున్నారు.

### జిల్లాల వారీగా సాధించిన సీట్లు..

1404 సీట్లకు గాను జిల్లాల వారీగా సాధించిన సీట్లు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా నుంచి 322, సంగారెడ్డి జిల్లా నుంచి 178, కామారెడ్డి జిల్లా నుంచి 93, నిర్మల్ జిల్లా నుంచి 92, మెదక్ జిల్లా నుంచి 78, కరీంగన్ జిల్లా నుంచి 71, నిజామాబాద్ జిల్లా నుంచి 68, రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 57, రంగారెడ్డి జిల్లా నుంచి 46, ఖమ్మం జిల్లా నుంచి 41, మహబూబాబాద్ జిల్లా నుంచి 31, ఆదిలాబాద్ జిల్లా నుంచి 29, నల్గొండ జిల్లా నుంచి 27, జగిత్యాల జిల్లా నుంచి 25, జనగాం జిల్లా నుంచి 25, మంచిర్యాల జిల్లా నుంచి 24, వరంగల్ అర్బన్ జిల్లా నుంచి 22, మేడ్చల్ జిల్లా నుంచి 20, యాదాద్రి జిల్లా నుంచి 18, హైదరాబాద్ జిల్లా నుంచి 17, జయశంకర్ జిల్లా నుంచి 14, పెద్దపల్లి జిల్లా నుంచి 14, సూర్యాపేట జిల్లా నుంచి 14, వరంగల్ రూర్బన్ జిల్లా నుంచి 14, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 12, భద్రాద్రి జిల్లా నుంచి 9, వనపర్తి జిల్లా నుంచి 9, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 7, ములుగు జిల్లా నుంచి 7, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 4, జోగులాంబ గద్వాల జిల్లా నుంచి 2, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఓపెన్ కేటగిరీలో నెల్లూరు జిల్లా నుంచి 3, కర్నూలు జిల్లా నుంచి 2, శ్రీకాకుళం జిల్లా నుంచి 2, విశాఖ పట్నం జిల్లా నుంచి 2, అనంతపురం, కడప, కృష్ణ, ప్రకాశం, వెస్ట్‌గోదావరి జిల్లాల నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారు.

### కేటగిరీల వారీగా కటాఫ్

ఎంపికైన విద్యార్థులు కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులు ఇలా ఉన్నాయి. ఓసీ కేటగిరిలో 10.2, ఈడబ్ల్యూస్‌లో 9.9, బీసీ–ఏ లో 10.1, బీసీ–బీ లో 10.1, బీసీ–సీలో 9.3, బీసీ–డీ లో 10.1, బీసీ–ఈ లో 9.9, ఎస్సీలో 10, ఎస్టీ లో 9.9. కార్యక్రమంలో అడ్మిషన్ కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.